క్లుప్తంగా

86 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక, సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ గురువారం రెండో రోజు 86 శాతం పూర్తయింది. మండల పరిధిలో 9348 మంది లబ్ధిదారులకు గాను రూ.2,57,85,250లు నగదు పింఛను పంపిణీ చేయాల్సి ఉంది. తొలిరోజు 75 శాతం పంపిణీ కాగా, రెండో రోజు 86 శాతం వరకూ పంపిణీ చేశారు. తెల్లవారుజామున వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు.

గాయపడిన ఫొటోగ్రాఫర్‌కు సహచరుల ఆర్థిక సహాయం

నరసరావుపేట ఈస్ట్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ షేక్ ఫారూక్‌కు నరసరావుపేట ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.2.5 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. గత నెల 25వ తేదీన ఫారూక్ రోడ్డు ప్రమాదానికి గురై ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాద వివరాలు, వైద్యానికి అయ్యే ఖర్చు వివరాలు తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులు తమ మిత్రుల ద్వారా రూ.1.50 లక్షలు సేకరించగా, ఫారూక్ స్నేహితుడు భాష మరో లక్ష రూపాయలను సేకరించాడు. ఈ మొత్తాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు మారిశెట్టి కోటేశ్వరరావు, కోశాధికారి షేక్.షఫీ తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఫారూక్ కుటుంబ సభ్యులను పరామర్శించి సేకరించిన నగదును అందించారు. విరాళాలు సేకరణకు సహకరించిన పిడుగురాళ్ల, గుంటూరు అసోసియేషన్ ప్రతినిధులు సతీష్, అనీల్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నరసరావుపేటలో బీజేపీ సంబరాలు

నరసరావుపేట: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సెంటర్లో ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి పట్టణ ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అసెంబ్లీ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా పటిష్టమైన నాయకత్వం, పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ పథకాల విషయంలో అన్ని ప్రాంతాల వారిని సమదృష్టితో చూడటం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన మీద అత్యంత విశ్వాసంతో పార్టీ ఘన విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకుమాను వెంకట కోటేశ్వరరావు, ఇత్తడి కిరణ్, అమ్మాజీలాని, కామినేని హనుమంతరావు, దేవిశెట్టి శ్రీనివాస గుప్తా, సిద్దు అనంత నాగ బ్రహ్మచారి, తవ్వా మల్లికార్జున పాల్గొన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

చిలకలూరిపేట: తెలంగాణా రాష్ట్రం జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్ని తండాలో పుట్టి అత్యంత ప్రతిభ కనపరిచి కాకతీయ మెడికల్ కళాశాలలో లక్ష్యానికి చేరువలో ఉన్న ధరావత్ ప్రీతిబాయి మృతి కారకులను కఠినంగా శిక్షించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జూనియర్, సీనియర్ల మధ్య వ్యత్యాసాలకు, ర్యాగింగ్‌కు ఉన్నత విద్యాసంస్థలు, పాలనాధికారులు పాటిస్తున్న అనాగరిక విలువలకు పరాకాష్ట ప్రీతిబాయి మృతి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెను వేధింపులకు గురి చేసిన సైఫ్‌ను ఉరి తీయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బి చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, దేవర డేవిడ్, బి రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో కొబ్బరికాయల వేలంపాట

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలు బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు దేవాదయ అధికారి మంజూ ఉష గురువారం తెలిపారు. ఈవేలంపాటలో కొబ్బరికాయలు రూ. 80వేలు, కొబ్బరిచిప్పలు రూ.24 వేలకు వేలంపాటలో వినుకొండ వాసీ రోడ్డా ఆంజనేయులు దక్కించుకున్నట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈసారి జరిగిన బహిరంగ వేలంపాటలో ఆదనంగా ఆదాయం పెరిగినట్లు వివరించారు. దేవాదయ అధికారులు వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

అమరావతి: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వైఎస్సార్ సీపీపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు ధరణికోట యుకుడిపై నియోజకవర్గ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి బందారు ఆజయ్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులను, నాయకులను, వ్యక్తులను, పార్టీని కించపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టొద్దని హితవు పలికారు.

ఇచ్చిన హామీ అమలు చేస్తున్నాం

- ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

నరసరావుపేట: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నందున వచ్చే ఎన్నికల్లో వారిని ఓట్లు అడిగే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక జమీందారి ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని 18 నుంచి 34 వార్డులకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ఇన్‌చార్జ్‌లు, వలంటీర్లుకు సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎన్.కె. అంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ శిబిరానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈనెల 24న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. దీనిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు వారం రోజులపాటు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని గురించి తెలియ చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న కుతంత్రాలు తిప్పికొట్టాలన్నారు. జగనన్న గెలుపు కోసం ప్రతి ఒక్కరిమే కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ అనే తేడా లేని విధంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అంద జేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ, పసుపు కుంకుమ కార్యక్రమం పెట్టి దాచుకో.. దోచుకో.. పంచుకో అనే విధంగా వ్యవహరించారన్నారు.

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి ప్రజలను మోసగించి అధికారులకు వచ్చారని వాటిలో ఒక్క హామీ అయినా నెరవేర్చకపోవడంతో 2019 ఎన్నికల్లో ప్రజల తరిమికొట్టారని పేర్కొన్నారు. ప్రజలను వంచించడంలో పేరు పొందిన చంద్రబాబు ఆయనకు వంత పాడుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రజల్లో వెళ్లి ఓటు అడిగి హక్కు లేదని చెప్పారు. ప్రజాబలం లేని పవన్ కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేసినా ఘోర పరాభావం తప్పదని పేర్కొన్నారు. ప్రజలంతా మనకు మద్దతుగా ఉన్నారని, వారందరినీ సమన్వయం చేయాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లదే అన్నారు. ప్రజల మన్ననలు దేవుని ఆశీస్సులతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రిగా జగనన్న మళ్లీ గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

దివ్యాంగుడికి పింఛన్ అందజేత

గడపగడపకు తిరిగిన సమయంలో 18వ వార్డుకు చెందిన అల్లంశెట్టి పవన్‌కుమార్ అనే 20 ఏళ్ల దివ్యాంగుడికి వికలాంగత్వ పెన్షన్ల రాసిన వెనువెంటనే మంజూరైన పింఛన్ రూ.5 వేలను గోపిరెడ్డి అందజేశారు. అదేవిధంగా తన సొంత నిధులతో రెండు చక్రాల ట్రైసైకిల్‌ను అందించారు.

బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గజ్జల బ్రహ్మారెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాబేగం ఖాజావలి, పొడ చైర్మన్ మిట్టపల్లి రమేష్, మద్దిరెడ్డి నరసింహా రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం స్వామి, వడ్డెర సంక్షేమ జిల్లా కమిటీ మెంబర్ వేములశివ, యువజనవిభాగ రాష్ట్రకార్యదర్శి గోగుల మనో హర్, నవభారత వికలాంగుల అధ్యక్షులు కర్నాటి కృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు అచ్చి శివకోటి, మాజీ కౌన్సిలర్లు కారుమంచి మీరావలి, మాడిశెట్టి మోహనరావు, నిడమానూరి సురేంద్ర, మర్రిపూడి రాంబాబు, కురుగుంట్ల కోటిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంతటి వారినైనా క్షమించం

ఎన్టీఆర్ విగ్రహ ధ్వంసంపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల), శావల్యాపురం: శావల్యాపురం మండలం గంటవారిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని నాశనం చేయాలని చూసిన వారిని వదిలిపెట్టే సమస్యలేదని, వాళ్లు ఎంతపెద్దవారైనా సరే క్షమించే ప్రసక్తే లేదని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు గురువారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఏదో ఒకటి చేసి ఈ కార్యక్రమాన్ని ఆపాలనే ఉద్దేశంతో పక్కా ప్లానింగ్‌తో టీడీపీలోని వారే ఆ ఎన్టీఆర్ విగ్రహాన్ని నాశనం చేసి అది మా పార్టీ వారిపై నెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. జీవీ ఆంజనేయులు సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఆ మహనీయుని పేరు వాడుకుంటున్నారని, మీకు నిజంగానే ఆయనపై అంత ప్రేమ ఉంటే 14 సంవత్సరాలు ఆయన పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఆయనకు ఇచ్చిన గౌరవం ఏమిటో చెప్పాలన్నారు. కానీ మేము అలా కాదని, ఆయన కీర్తిని దేశం నలుమూలల చాటే విధంగా రాష్ట్రంలో ఒక జిల్లాకి ఎన్టీఆర్ పేరు పెట్టి గౌరవించామని తెలిపారు. కానీ మీరు ఆయనని వెన్నుపోటు పొడిచి ఆయనపై చెప్పులు వేసి మానసికంగా హింసించి ఆ మహానుభావుడి చావుకి కారణమయ్యాయరని గుర్తు చేశారు. నిజాలు తెలుసుకోకుండా మాపై ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పూర్తిస్థాయిలో పోలీసుల ద్వారా దర్యాప్తు చేయించి నింధితులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సుభాష్

చిలకలూరిపేట: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించుకోవాలని గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత, ప్రఖ్యాత జ్ఞాపకశక్తి శిక్షకుడు మొగిలి సుభాష్ అన్నారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ విద్యాసంస్థల్లోని పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రేరణ తరగతులను బి ది ఛేంజ్ సంస్థ సహకారంతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ పెట్టే విధానం విడనాడి, వినడం, రాయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని చెప్పారు. దీని కోసం కష్టపడుతున్నామనే భావన విడనాడి ఇష్టంగా చదవాలని చెప్పారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలను పాటించాలని చెప్పారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు, సూచనలు, సలహాలు, మెలకువలను ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం పి.మేరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేనాబేబి పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

డిమాండ్లు నెరవేర్చాలన్న ఉద్యోగ సంఘాల నాయకులు



కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

నరసరావుపేట టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా జీడీఎస్ పీజీసీఏ పిలుపు మేరకు స్టేషన్‌రోడ్డులోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు ధర్నా చేశారు. డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల చైర్మన్ పీవీ నారాయణ, కన్వీనర్ పి.అజయ్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ ఎస్.యోగేశ్వరరావు, అడ్వైజర్ వాసిరెడ్డి శివాజీ ధర్నాకు నాయకత్వం వహించారు. డీజీఎస్ కమిటీ సిఫార్సు మేరకు సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, డీజీ ఆఫీసులో నిర్ణయించే అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలను నిలిపి వేయాలని, లక్ష్యాల కోసం ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, ఉద్యోగి సెలవు పెట్టినప్పుడు ప్రత్యామ్నాయ వ్యక్తిని నియమించుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐజీడీఎస్‌యు డివిజన్ అధ్యక్షుడు వై.పాపిరెడ్డి, ఎన్‌యుడీడీఎస్ డివిజన్ అధ్యక్షుడు పి.రామారావు, బీపీఎంలు సీహెచ్.వెంకటేశ్వర్లు, షేక్ మాబు సుభాని, పి.బ్రహ్మయ్య, బి.రాధిక, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన



తిరునాళ్ల ఏర్పాట్లుపై ఆలయ కమిటీ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎస్సై రవికృష్ణ

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్ళ తిరునాళ్ల వేడుకలు ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 22న జరగనున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఎస్సై గల్లా రవికృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై గల్లా రవికృష్ణ మాట్లాడుతూ తిరునాళ్ల జరిగే ఏరియాను పరిశీలించామని, అలాగే ఆలయ కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులతో మాట్లాడి తిరునాళ్లకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమవంతు సహకారం అందించాలన్నారు. విద్యుత్ ప్రభలు, దుకాణాలు, వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేయు స్థలాలను పరిశీలించామన్నారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి కాంచిన తిరునాళ్లకు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారన్నారు.

ప్రతి సచివాలయంలో వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ జి.శోభారాణి

నరసరావుపేట: జిల్లాలోని ప్రతి సచివాలయంలో నిర్దేశించిన తేదీలలో అరవై ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితముగా చేసే కంటి పరీక్షలు, ఆపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి కోరారు. గురువారం తన చాంబర్‌లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3 అవ్వాతాత కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షల్లో దృష్టి లోపం గలవారికి ఉచితంగా కళ్లద్దాలు సిఫార్సు చేస్తామన్నారు.శుక్లాలు ఉన్నవారికి నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ ఉచితంగా చేస్తామని, అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమ మేనేజర్ డాక్టర్ ఎ.భువనేశ్వరి, నేత్రాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్య



నాదెండ్ల: కడుపునొప్పి తాళలేక ఓ మైనర్ బాలిక ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై ఎ.భాస్కర్ వివరాల మేరకు మండల పరిధిలోని గొరిజవోలు గ్రామంలోని జ్యోతిర్మయి స్పిన్నింగ్ మిల్లులో ఒడిషాకు చెందిన ఓ కుటుంబం గత కొన్నేళ్లుగా క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ మిల్లులో పని చేస్తుంటారు. ఒడిషా రాష్ట్రంలోని గంజాం జిల్లా భ్రమరాపూర్‌కు చెందిన రీటాసాహు, హరిసాహు దంపతులకు నలుగురు సంతానం. తల్లిదండ్రులతో పాటూ మూడో కుమార్తె మనీషా సాహూ (16), కుమారుడు నివాసం ఉంటారు. బుధవారం ఉదయం 9 గంటలకు తల్లిదండ్రులు ఇరువురూ పనులకు వెళ్ళారు. సాయంత్రం క్వార్టర్స్‌కు తిరిగి వచ్చే సరికి తలుపులు వేసి ఉండటం గమనించి పగలగొట్టి చూడగా, మనీషా సాహు ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. అయితే కొన్ని నెలలుగా నెలసరి సమయంలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోందని తల్లిదండ్రులు వాపోయారు. తోటి కార్మికుల సాయంతో మనీషాసాహును కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై తండ్రి హరిసాహు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నాదెండ్ల: మండల పరిధిలోని గొరిజవోలు గ్రామంలో గురువారం ఎస్సీ కాలనీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఆరుగురు గాయాలపాలు కాగా, క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురు మహిళలు, ఇరువురు పురుషులు ఉన్నారు. గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా ఇదే కాలనీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగ్గా, ప్రభుదాసు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అప్పట్లో రెండు వర్గాలకు చెందిన 13 మందిపై కేసు నమోదుకాగా, రిమాండ్ విధించారు. తాజాగా మరోసారి రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తటంతో చిలకలూరిపేట రూరల్ సీఐ వై.అచ్చయ్య, యడ్లపాడు ఎస్సై రాంబాబు, సిబ్బందితో కలిసి గ్రామాన్ని చేరుకున్నారు. గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు.

రామారావు మాస్టారి మృతికి నివాళి

అమరావతి: విశ్రాంత ఉపాధ్యాయుడు బచ్చు రామారావు(87) బుధవారం సాయంత్రం మరణించారు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సుమారు 37ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రామారావు మాష్టారుగా స్థానికులకు సుపరిచితుడైన ఆయన మృతదేహాన్ని మండల పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించి, నివాళులర్పించారు.

కబడ్డీ రాష్ట్రజట్టుకు వినుకొండ విద్యార్థులు



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో స్థానిక గుడ్‌షపర్డ్ స్కూల్ విద్యార్థులు విష్ణువర్ధన్, పి.శ్రీనివాసరావులు గుంటూరు జిల్లాకు జట్టు తరపున చక్కని ప్రదర్శన కనపరిచి రాష్ట్రజట్టుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గుడ్‌షపర్డ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ కబడ్డీ చరిత్ర కలిగిన గ్రామీణ క్రీడ అని, కబడ్డీ ఆడటం వలన మానసిక ధైర్యం, శారీక దృఢత్వం పెంచుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో తిరునాళ్ల సందడి



దొండపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో బ్రహ్మంగారి ఆలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసారు. ఆలయ సమీపంలో బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించారు. గ్రామంలోని ఆరు ప్రాంతాల్లో పాటకచేరీలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. సాతులూరు-దొండపాడు రోడ్డును రూ.70లక్షలతో పూర్తిచేసామని, రూ.కోటితో గ్రామంలోని మెయిన్‌రోడ్డును సీసీరోడ్డుగా నిర్మించినట్లు తెలిపారు. దొండపాడు-పెదరెడ్డిపాలెంరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని త్వరలోనే రోడ్డును పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ పేరం రాజానందరెడ్డి, గ్రామ సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నపురెడ్డి శివారెడ్డి, పుట్లూరి రామకోటిరెడ్డి, ముచ్చుమారి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



స్వామి వారి దేవాలయం

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు సమీపంలోని బోటిమీద వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఈ నెల 5వ తేదీ ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయానికి రంగులు వేసి మూలవిరాట్ మెరుపులు రుద్ది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దాతల సహకారంతో దేవాలయానికి నూతన రేకుల షెడ్‌లు, లౌడ్స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా దేవాలయానికి ముందు నూతనంగా సత్రాన్ని దాతలు నిర్మిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే తిరునాళ్ల రోజు రాత్రి భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

రహదారులు సుందరంగా ఉంచుదాం

- ఆ బాధ్యత మనందరిపై ఉంది
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



వార్డులో శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు ఎప్పుడు చూసినా సుందరంగా ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులు విజిట్ చేసి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. శానిటేషన్ సెక్రటరీలతో మాట్లాడుతూ పట్టణం పల్నాడు జిల్లా కేంద్రమైనందున అందరి దృష్టి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి అధికారులు, వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి సందర్శకులు వస్తుంటారు కనుక పట్టణ సుందరికరణపై దృష్టిసారించాలన్నారు. తద్వారా ఒక మంచి అభిప్రాయం వచ్చేవిధంగా మనమందరం కృషి చేద్దామన్నారు. ప్రతి ఒక్క సెక్రటరీ తమకు కేటాయించిన టైం షెడ్యూల్ ప్రకారం వార్డులో ఉంటూ పనిని సకాలంలో పూర్తి చేయించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఫీల్డ్‌లో ఉండని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వార్డులో ఏ విధమైన సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి లేదా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెల్లటూరులో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం



ఉచిత కంటి వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శాంతిరామ్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పటల్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరానికి 265 మంది హాజరయ్యారు. వీరిలో 75 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారని, వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని శాంతిరాం మెడికల్ కాలేజీ ప్రతినిధి ఆది తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎం.చినవీరయ్య, ఎంపీటీసీ జి.చినవెంకయ్య, ఖజ్జాయం లక్ష్మీనారాయణ, శాంతిరామ్ మెడికల్ కాలేజీ వైద్యులు, సిబ్బంది, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించండి

- ఆదేశించిన ఆర్డీవో శేషిరెడ్డి
- రీసర్వే అభ్యంతరాలపై రైతుల నుంచి అర్జీల స్వీకరణ



బుక్కాపురంలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి

నాదెండ్ల: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలను సిబ్బంది వెంటనే పరిష్కరించాలని నరసరావుపేట ఆర్డీవో ఎం శేషిరెడ్డి ఆదేశించారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మొదటి విడతలో చిరుమామిళ్ల, కనపర్రు, సంకురాత్రిపాడు, చందవరం, బుక్కాపురం గ్రామాల్లో సర్వే పూర్తయింది. బుక్కాపురం గ్రామంలో రీసర్వే పూర్తయిన సందర్భంగా గత రెండు రోజులుగా హద్దు రాళ్లు వేస్తున్నారు. రీసర్వే పూర్తయినట్లు 92-నోటీసులు అందిన రైతులు అభ్యంతరాలు ఉన్నట్లయితే 21 రోజులలో మొబైల్ మెజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. మొబైల్ మెజిస్ట్రేట్ టీంలో మండల డిటీ, సర్వేయర్ ఉంటారన్నారు. గొరిజవోలు గ్రామాన్ని సందర్శించి రీసర్వే పనులు 75 శాతం పూర్తయినందున రైతులకు 92-నోటీసులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అల్లడి రవికుమార్, గొర్రెపాటి గృహలక్ష్మి, తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ అనురాధ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు అశోక్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బాలామృతం చిన్నారులకు వరం

నరసరావుపేట టౌన్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే బాలామృతం తీసుకోవటం వల్ల పిల్లలకు పౌష్టికాహార సమస్యలు ఉండవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ గౌస్య అన్నారు. గురువారం బరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో వయస్సుకు తగ్గ ఎత్తు లేని పిల్లల తల్లులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలామృతం ఉపయోగాలు, ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఇందిర, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, ఉష, ఆశ, వర్కర్‌లు సత్యవతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.